# రెండో కట్నం

కథ

తోడబుట్టిన చెల్లికిచ్చిన కట్నం ఆమెకిచ్చిన ఆస్తి కానపుడు— ఆమె అడిగిన ఆస్తిలో వాటా ఏమవుతుంది?

ఆకెళ్ళ గిరిజ

మా ఆవిడ్ని అర్జెంటుగా బయటికి తీసికెళ్ళి —ఒక రెస్టారెంట్‌లో కూర్చోబెట్టి, ఫలహారాలు, శీతల పానీయాలు సేవింపచేసి — ఆనక టాంక్‌బండ్ మీదకి తీసికెళ్ళి ఉపోద్ఘాతం మొదలుపెట్టాను. 'నేననుకున్న దొకటి, జరిగింది మరొకటి. మా నాన్నగారు ఇంత త్వరగా దాటిపోతారనుకోలేదు. ఏదో కొన్నాళ్ళు మరి మనకి తప్పదు... ఏదో ఒక మంచి సంబంధం చూసి మా చెల్లికి పెళ్ళి చేసేస్తే మన బాధ్యతలు సగసం అయిపోతాయి... మా తమ్ముడు, మా అమ్మ అంటావా! వాళ్ళు లోకంతోపాటే... కాస్త కొన్నాళ్ళు ఓపిక పట్టాలి' అని అన్నాను.

''ఇంత ఇదిగా చెప్తారెందుకు— ఆ మాత్రం బాధ్యత నాకు తెలీదా—'' ఆరిందలా నవ్వింది మా ఆవిడ.

'హమ్మయ్య!' తేలిగ్గా నిట్టూర్చాన్నేను

★★★

'ఈ ఏడాదిలోగా దాన్నో అయ్య చేతిలో పెడితే — పోయినాయన కోరికా తీరుతుంది! కన్యాదాన ఫలమూ దక్కుతుంది...'' అందుకు మా అమ్మ నాందీ ప్రస్తావన చేసింది నా దగ్గర...

''అలాగేనమ్మా... నేనూ తమ్ముడూ కూడా అదే ఆలోచిస్తున్నాం...'' ఓ శుభముహూర్తాన వరాన్వేషణ మొదలుపెట్టాం!

ఎంతో తేలిగ్గా చేయవచ్చని ధీమాతో దిగిన ఈ వరాన్వేషణలో నేను, మా తమ్ముడు రవీ కూడా పూర్తిగా అలిసిపోయాం. కొండకచో డస్సిపోయాం. సరిగ్గా అలాంటి టైములో వచ్చింది రామ్మూర్తి సంబంధం. రామ్మూర్తి సెంట్రల్ గవర్నమెంట్‌లో ఆఫీసరు. ఉద్యోగం బొంబాయిలో. స్వంత ఫ్లాటు ఉంది. అంతో ఇంతో బ్యాంక్ బాలెన్సు... ఈరోజుల్లో — అంత తేలిగ్గా కుదర్చలేని పెళ్ళిసంబంధం... ఒక యాభైవేలు కాష్ ఇచ్చేద్దు... మిగతా లాంఛనాలు జరిగించేటట్లు సంబంధం కుదుర్చుకున్నాం.

పెళ్ళి కొడుకు కూడా బాగానే వుండటంతో మా శారదకి మరో మాట అనే సావకాశం దొరకలేదు. ఆనందంగా ఒప్పేసుకుంది!

మరి మా అమ్మ సంబరానికి హద్దుల్లేవు... చాలా ఉత్సాహంగా అన్ని విషయాల్లోనూ తానే చొరవ తీసుకుని దగ్గరుండి పెళ్ళి పనులు అవీ ప్రారంభించింది. మా నాన్న పోయాక, అమ్మ అంత ఆనందంగా కనపడ్డం అదే ప్రథమం!

అందరం నిరీక్షిస్తున్న ఆ శుభగడియలు రానేవచ్చాయి. ఇంట్లో డబ్బుకి లోటులేదు కాబట్టి — వివాహం ఘనంగానే జరిపించాం. మా పెళ్ళయి జస్ట్ రెండేళ్ళే అయినా నేను — మా ఆవిడ పెళ్ళికి ఆధ్వర్యం వహించి, పెద్దవాళ్ళమైపోయినట్టు ఫీలయినాం.

నవవరుడు రామ్మూర్తి, శారద మెడలో తాళికట్టాడు. మేళ తాళాలు మ్రోగాయి. బంధువులు, స్నేహితులు, పెద్దలు అక్షితలు వేసి ఆశీర్వదించారు.

అంతవరకూ సంతోషంతో చిన్న పిల్లలా కేరింతలు కొట్టిన మా అమ్మ అప్పగింతలు తంతు వచ్చేసరికి — కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

ఎలాగైతేనేం — నాది, మా తమ్ముడిది, ముఖ్యంగా మా అమ్మది గుండెబరువు తగ్గింది. శారద రామ్మూర్తితో కొత్త కాపురానికి బొంబాయి వెళ్ళిపోయింది.

★★★

శారత పెళ్ళయిన ఆరునెల్లనుకుంటానూ— మా తమ్ముడు రవికి ఒక ప్రవేటు కంపెనీలో ఉద్యోగం వచ్చింది. జీతం రెండువేల అయిదువందలు!

మరి కొన్నాళ్ళకి నాకు కొడుకు పుట్టడంతో ఇంట్లో ఆనంద రేఖలు వెల్లివిరిసాయి. మా నాన్నగారు పోయినప్పటి విషాద ఛాయలు పూర్తిగా అంతరించాయి.

సంతోషం మీద మరో సంతోష వార్త! రవికి పెళ్ళి సంబంధం రావడం — ఆ సంబంధం రవి ఉద్యోగం చేస్తున్న చోట — మరో ఉద్యోగి అయిన శేఖరంగారమ్మాయి. శైలజ. ఆ అమ్మాయిని ఒకటి రెండుసార్లు శేఖరంగారి వెంటవెళ్ళి వాళ్ళింట్లో చూడ్డం — పరిచయాలతో — రవి సహజంగానే మెత్తబడ్డాడు. తర్వాత మొహమాటపడ్డాడు — కొన్నాళ్ళకి కంగారుపడి మా అమ్మ చెవిన వేశాడు! ఇదంతా జరిగి నా చెవిదాకా రావడానికి ఓ ఆర్నెల్లు పట్టిందనుకుంటాను.

మా అమ్మ ఓరోజు 'వాడిక్కూడా ఈ సంబంధం ముడిపెట్టేయరా? నేనూ పెద్దదాన్నైపోయాను. ఏ క్షణాన ఏమవుతుందో...'' అనేసింది.

''సరేనమ్మా! ఈసారి మనం మగపెళ్ళివారం. అన్నీ చూసుకొని వచ్చి ఓ.కే అంటే వాళ్ళకి నాల్గురోజులు పట్టదు'' భరోసా ఇచ్చాను మా అమ్మకి.

అనుకున్నట్టుగానే శేఖరంగారు వచ్చి రవి సంబంధం విషయం నాదగ్గర ప్రపోజ్ చేయడం — లాంఛనంగా నేనూ, మా ఆవిడ, మా అమ్మ, రవి వెళ్ళి చూడడం, ''సరే'' అనడం ఒకదాని వెంట ఒకటి జరిగిపోయాయి.

'దగ్గర్లోనే మంచి ముహూర్తాలున్నాయి' అంటూ శేఖరంగారు హడావుడిగా నెల తిరక్కుండానే రవి, శైలజల పెళ్ళి జరిపించేశారు. ఒక్కసారి తల్చుకుంటే — కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదనే సామెత అక్షరసత్యం అని మరోసారి తేలిపోయింది.

శైలజ కాపురానికి రావడంతోనే మా ఇంట్లో — అప్పటివరకు అన్నీ సాఫీగా, సజావుగా స్మూత్‌గా జరిగిపోయే విషయాలు... కొండకచో... బరువుగా, గరగరగా, ఫ్రిక్షన్‌తో సాగడం మొదలుపెట్టాయి.

మెల్లిగా రెండుమూడు నెలలు గడిచేసరికి — ఒక ఒరలో రెండు కత్తులున్న ఫీలింగ్ వచ్చేసింది నాకు.

మా ఆవిడ — బొత్తిగా నోట్లో నాలుకలేని మనిషి —ఆవిడే ఉక్కబోతగా ఫీలవడం మొదలుపెట్టింది. నా దగ్గర ఒకటి రెండుసార్లు 'కొత్తకోడలు' కొత్త ప్రవర్తన విషయం ప్రస్తావించింది.

''పెద్దవాళ్ళం.. మనం తొందరపడకూడదు... నేనూ గమనిస్తూనేవున్నా... ఓపికపట్టు...'' అన్నేను.

అప్పటివరకూ తెల్లవారితే ఎత్తుకుతిప్పి వాడడిగినవన్నీ కొనిచ్చి గారంచేసే మా తమ్ముడే నా కొడుకుని చూసీచూడనట్టు ఉదాసీనంగా ఊరుకుంటున్నాడు.

నా కొడుకుని వాడు ఎత్తుకు తిప్పాలని రూలేం లేదుగానీ, పెళ్ళయిన రెండు మూడు నెలలకే వాడి ప్రవర్తనలో అంత తేడా కనబడితే — అది చెప్పుకోవాల్సిన పాయింటే కద్దా!

కొత్త దంపతులు — రవి, శైలజ వేరే కాపురం పెట్టుకుంటామని డిక్లేర్ చేశారు. రవి జీతం దృష్ట్యా వాడి ఇంత త్వరలో ఆ నిర్ణయం తీసుకుంటాడనుకోలేదు. వాళ్ళ కాపురం — వాళ్ళ ఇష్టం అని వూరుకొన్నాన్నేను.



అయితే — వాళ్ళతోపాటు మా అమ్మ కూడా బయల్దేరేసరికి నేనింక తట్టుకోలేకపోయాను.

''ఏదో కొత్త కాపురం కదా! కొన్నాళ్ళు...'' అంటూ వెళ్ళినావిడ మరి వచ్చే తీరు కనపళ్ళేదు!

సరే పెద్దావిడ... ఆవిడ ఇష్టం — అని వదిలేసి ఊరుకొన్నాను.

ఆ తర్వాత ఆవిడ ఇష్టాలు ఒకోటి మారిపోవడం మొదలెట్టాయి — అనేకంటే — మా మరదలూ, వాళ్ళా మార్చేయడం మొదలెట్టారంటే సమంజసంగా వుంటుంది.

వాళ్ళకి తోడుగా మా చెల్లెలు శారద కూడా చేరి, నామీద మా ఆవిడమీద, మా అమ్మకి ఏం మారిపోశారోగాని — ఆవిడ నాపట్ల ప్రవర్తించే తీరులో అమాహ్యమైన మార్పు, నిర్లిప్తత చోటుచేసుకున్నాయి.

ఈమధ్య కాలంలో మా చెల్లెలు శారద ప్రవర్తన గురించి కొంచెం చెప్పాలి. మా తమ్ముడి పెళ్ళిలోనూ, పెళ్ళి అయిన దగ్గర్నుంచే శారద, రవి, శైలజ, మా అమ్మ దగ్గర జేరి — వాళ్ళొక గ్రూప్‌గా చలామణీ అవడం మొదలుపెట్టారు. మా చెల్లెలు మా వూరు వచ్చినా నేరుగా మా తమ్ముడింట్లో దిగడం, ఏదో ఒక చుట్టం చూపుగా నా దగ్గరకి రావడం — మొదలుపెట్టింది. ఇవన్నీ చూస్తున్న నాకు వాళ్ళ ప్రవర్తన 'ఫీషీ'గా తోచింది.

కానీ నేనేం అన్లేదు. నేనేం అనకపోయినాగాని ప్రవర్తనకి అదే పదే పదే సంజాయిషీలు ఇచ్చుకోవడం నాకింకా గుర్తు!

అనుకోనివే జరగడం జీవితం అయితే — అంతకంటే ఊహించని విషయం మా అమ్మ సడెన్‌గా హార్ట్ ఎటాక్ తోచని పోవడం!

ఆ షాక్‌నుంచి కోలుకుని మా తమ్ముడింటికి వెళ్ళి కర్మకాండలు ముగించిన నాకు — మరో షాకింగ్ న్యూస్ మా అమ్మ విల్లు మా తమ్ముడు, చెల్లెలు కూల్‌గా బయటపెట్టడం!

నాకు ఎంతో సన్నిహితురాలైన మా అమ్మ ఆవిడ నగలు నట్రా ఏ ఒక్కటీ నాకుగానీ, మా ఆవిడకిగానీ ఇవ్వకపోవడం! 'పోన్లే! మనకింతే ప్రాప్తం' అనుకుని నేనూ మా ఆవిడా ఇంటికొచ్చేశాం.

సుమారు నాలుగు లక్షలు ఖరీదుచేసే చరాస్తులు నాకు మాట మాత్రం చెప్పకుండా అపహరించారన్న వాస్తవంకంటే — వాళ్ళు నాకు చేసినా నమ్మకద్రోహమే నన్నెక్కువగా బాధించింది.

కొన్నాళ్ళపాటు మా ఆవిడ దగ్గర ముఖం ఎత్తుకోలేకపోయాను! ఏదో గిల్టీఫీలింగు... నువ్వు అసమర్థుడివి. చాతకానివాడివి' అని ఆవిడ నన్ను అనకపోయినా, అది సమర్థత, చాతకాని తనం అని నేను నమ్మకపోయినా.. ఏదో కలగాపులగంగా వచ్చేసే భావ సంచలనం — నన్ను అతలాకుతలం చేసింది!

క్రమంగా నేను ఒంటరివాడిని. నాకు నా అన్నవాళ్ళెవరూ లేరు— అనే ఫీలింగ్ బాధించడం నాకు అలవాటైపోయింది.

దేనితోనూ సంబంధంలేని కాలం గడిచిపోవడం మొదలెట్టింది!

★★★

ఈ కథ ఇక్కడితో ఆగిపోలేదు.

ఓరోజు ఉదయం.. సుడిగాలిలా వచ్చాడు రవి. చేతిలో రిజిస్టర్ లెటర్‌తో.

'అన్నయ్యా! కొంప మునిగింది. శారద మనింట్లో వాటా కావాలంటూ లాయర్ నోటీసు పంపింది. చూశావా అన్యాయం? అంటూ నా ఎదురుగా చతికిలబడ్డాడు!

తనదాకా వచ్చేసరికి మా రవికి తెలివి వచ్చింది. అదే చరాస్తుల విషయంలో నన్ను గుర్చి పట్టించుకున్నవాళ్ళు లేరు!

అయినా నాకు మా తమ్ముడురవిమీద కోపం రాలేదు. ఇంట్లో మా ఇద్దరి వాటాలకంటే రెట్టింపు విలువగల చరాస్తులు వంచనతో తీసుకుపోయి — మాకు నోటీసులిచ్చిన మా చెల్లెలు శారద నన్నూ వెక్కిరించసాగింది!

''ఆరోజు మంచి కట్నం ఇచ్చి మా అన్నయ్య, పెళ్ళి చేసాడని వదిన దగ్గర మురిసిపోయావు. ఇప్పుడు మళ్ళీ ఈ ఆస్తిలో నీకు రెండో కట్నం ఎలా చెల్లుతుందమ్మా... దీన్ని ఏ కోర్టులో ఏ లీగల్ ప్రొసీజర్ ప్రకారం సవాలు చేయగలం?'' అని నిశ్శబ్దంగా ప్రశ్నించానా కనపడని ఆ ఆడపడుచుతనాన్ని.

### కథలకు ఆహ్వానం

లబ్ధప్రతిష్ఠుల నుంచీ, కొత్త కథకులనుంచీ వాస్తవ సమాజాన్ని ప్రతిబింబించే ఉత్తమ కథలను ఆహ్వానిస్తున్నాం. వ్రాత ప్రతి ఆరు అరఠావులు మించకూడదు.

—ఎడిటర్